## క్లుప్తంగా

### ఆర్‌సీఎం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆర్‌సీఎం ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్త పోణంగి లూర్దునగర్‌లో లూర్దుమాత ఆర్‌సీఎం ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నిర్మాణం సకాలంలో పూర్తికావాలని వారు ఆకాంక్షించారు. మరియమ్మ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని కమ్యూనిటీ హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన సభలో ఫాదర్ జాకో, సంఘ పెద్దల ఆధ్వర్యంలో మేయర్ దంపతులను ఘనంగా స్వాగతించారు. డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, స్థానిక కార్పొరేటర్ దారపు అనూష తేజ, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, నిడికొండ అన్నపూర్ణ నరేంద్ర, సబ్బన శ్రీనివాసరావు, జనపరెడ్డి కనక శ్రీ రాజేశ్వరి కృష్ణ పాల్గొన్నారు.

### మహిళలకు రక్షణ కల్పించాలి



సెయింట్ థెరిస్సా కళాశాలలో సంతకాలు చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలో పేరు మార్చటం కాదని మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా డిమాండ్ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఏలూరు సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో దేశంలో ప్రజాస్వామ్యం – మహిళలు, చిన్నారుల రక్షణ అనే అంశంపై 5వ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు పి.సురేష్ కుమార్, ఐద్వా నాయకులు జె.హరీషాదుర్గ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి మహిళలు చిన్నారులపై అత్యాచారాలు అరికట్టాలని రాసిన బ్యానర్ పై సంతకాలు సేకరించారు. సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పి.మెర్సి, సిస్టర్ పద్మావతి, ఐద్వా ఏలూరు నగర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజ్యలక్ష్మి తదితరులు మాట్లాడారు. విద్యార్థినులు, లెక్చరర్లు పాల్గొన్నారు.


### బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా విక్రమ్ కిషోర్



ఏలూరు (టూటౌన్): బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా చౌటుపల్లి విక్రమ్ కిషోర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరుకు చెందిన విక్రమ్ కిషోర్ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా, 12 సంవత్సరాలు దెందులూరు నియోజకవర్గ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019లో బీజేపీ చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏలూరు జిల్లా అధ్యక్షునిగా నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, సుధాకర్ కృష్ణ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### నూరుశాతం అక్షరాస్యతకు కృషి చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంటర్ క్యాంపస్ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్సీ అగ్రికల్చర్ చేసిన ట్రాన్స్‌జెండర్ కె.సారిక మాట్లాడుతూ జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడంలో తాను సైతం భాగస్వామినౌతానని తెలిపారు. అక్షరాస్యత ప్రాధాన్యత – సమాజ మార్పుపై ప్రభావం అనే అంశంపై ఆమె మాట్లాడారు. అనంతరం ఇదే అంశంపై కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ సారికను జిల్లా వయోజన విద్యాశాఖ తరఫున లిటరసీ ఐకాన్‌గా గుర్తించి సత్కరించారు. సీఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, ఏపీఓలు కేవీవీ సత్యనారాయణ, ఆర్ విజయ కుమార్ పాల్గొన్నారు.



దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఐజీ



100 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్‌జంప్‌లో పాల్గొన్న అభ్యర్థి



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

# తుది దశ ఎస్సై పరీక్షకు 2,174 మంది ఎంపిక

**ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్**



అభ్యర్థి ఎత్తును కొలుస్తున్న పోలీస్ సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టుల నియామకాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్సై పోస్టుల నియామకాలకు సంబంధించి ఆగస్టు 25 నుంచి నేటి వరకు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఫిజికల్ పరీక్షలకు 3,579 మంది పురుష అభ్యర్థులు వివిధ పోటీలకు హాజరుకాగా వారిలో సత్తా చాటిన 2,174 పురుష అభ్యర్థులు తుది దశ పరీక్షలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎస్సై పోస్టుల ఎంపికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. దేహదారుఢ్య పరీక్షలను కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా, ఏలూరు జిల్లా ఏఎస్పీ ఎంజేవీ భాస్కర్, డీఎస్పీలు కె.ప్రభాకర్‌రావు, జీవీఎస్ పైడేశ్వరరావు వెంకటేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న అభ్యర్థులు

# పేదల సొంతింటి కల సాకారం

- జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం
- సకాలంలో బిల్లుల చెల్లింపు
- లబ్ధిదారుల ఆనందోత్సాహాలు



జాలిపూడిలోని జగనన్నకాలనీ

ఏలూరు రూరల్: పేదల సొంతింటి కల సాకారమవుతోంది. జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతోపాటు మరికొంత మొత్తాన్ని ఖర్చు చేసి లబ్ధిదారలు చూడముచ్చటైన మోడల్స్‌లో ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో చిన్నపాటి హాల్, ఒక బెడ్‌రూమ్, ఒక కిచెన్ రూం, బాత్‌రూమ్‌తో పాటు మేడపైకి మెట్లు, ఆపైన మరో రెండు గదులతో కూడిన రేకుల షెడ్డు నిర్మించుకుంటున్నారు. కొందరు రెండు అంతస్తుల బిల్డింగ్స్, డూప్లెక్స్ హౌస్ కట్టుకుంటున్నారు. ఆకట్టుకునేలా ఎలివేషన్స్ రూపొందిస్తున్నారు. నైరుతి వైపు స్థలం పూర్తిగా ఉపయోగించుకోవడంతో గదులు విశాలంగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు లబ్ధిదారులకు సిమెంట్, ఐరన్, ఇసుక అందిస్తున్నారు. కాలనీల్లోనే మెటీరియల్ గొడౌన్లు ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, గ్రామ సచివాయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. శనివారపుపేటలోని జగనన్న కాలనీ మోడల్ కాలనీగా రూపొందుతోంది. ఇక్కడ ఇళ్ల మోడల్స్‌ను పరిశీలించేందుకు ఇతర ప్రాంతాల నుంచి లబ్ధిదారులు వస్తున్నారు. జాలిపూడి, చాటపర్రు గ్రామాల జగనన్నకాలనీల్లో సైతం చూడచక్కని విధంగా ఇళ్లు నిర్మిస్తున్నారు.

**13 గ్రామాల్లో 22 కాలనీలు**

ఏలూరు రూరల్ పరిధిలోని మొత్తం 13 గ్రామాల్లో పేదలకు ప్రభుత్వం 22 జగనన్న కాలనీలు ఏర్పాటుచేసింది. 2,782 మందికి స్థలాలు అందించింది. ఇప్పటి వరకు 680 మంది పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. వీరికి రూ.12.24 కోట్లు అందించింది. మరో 1,590 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకు సుమారు రూ.6 కోట్లు మంజూరు చేసింది. ఏలూరు నియోజకవర్గంలోని పోణంగి, కొమడవోలు, చొదిమెళ్ల (లక్ష్మీపురం) జగనన్న కాలనీల్లో మొత్తంగా 21,943 మంది పేదలకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చింది. వీరిలో 21 వేల మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 1,969 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారు. వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.35.44 కోట్లు అందించింది. మరో 14,236 బీబీఎల్, 4,383 బీఎల్, 267 ఆర్ఎల్, 145 ఆర్‌సీ లెవెల్‌లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి సైతం లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇప్పటి వరకు సుమారు రూ.20 కోట్లు జమ చేసింది.



జాలిపూడి కాలనీలో లబ్ధిదారులు కట్టుకున్న ఇళ్లు



### 12, 13 తేదీల్లో సూర్యనమస్కారాల పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఈ నెల 12, 13 తేదీల్లో సూర్య నమస్కారాల పోటీలు నిర్వహిస్తున్నట్టు దత్తనాథ క్షేత్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని పటమట ఆశ్రమంలో ఈ పోటీలు నిర్వహిస్తారని, విజేతలకు శ్రీ సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 92970 52499లో సంప్రదించవచ్చని, ఆసక్తి గల వారు తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

### నేడు ఏలూరులో 'పాడనా తీయగా'

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో వైఎంహెచ్ హాలులో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి పాడనా తీయగా ప్రత్యక్ష సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక గాయనీ గాయకులను ప్రోత్సహించే నిమిత్తం పాడనా తీయగా కార్యక్రమాన్ని తలపెట్టామని, ఎంపిక చేసిన 15 మందితో నిర్వహించే ఈ కార్యక్రమం యూట్యూబ్‌లో ప్రసారమవుతుందని పేర్కొన్నారు. తద్వారా కొందరికి టీవీ, సినీ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.

## పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన కల్పించాలి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనపై విస్తృత అవగాహన ప్రజలకు కల్పించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేశ్ జిల్లా ప్రధానమంత్రి విశ్వకర్మ జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా గౌతమి సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై జిల్లాలో అమలుచేయాల్సిన అంశాలపై కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజనను కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రారంభించనుందని చెప్పారు. సంప్రదాయ వృత్తులు, జీవనోపాదులను బలోపేతం చేసేందుకు 2023–2028 వరకు ఐదేళ్లాపలు కేంద్రం పీఎం విశ్వకర్మ యోజనను అమలు చేయనుందని వివరించారు. 18 రకాల వృత్తులు, హస్త కళల అంశాల్లో లబ్ధిదారులను గుర్తించి నమోదు చేసే ప్రక్రియపై వలంటీర్లకు సమగ్ర శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ పథకం అమలు తొలిదశ క్రింద అర్హత గల 18 ఏళ్లు నిండిన సంప్రదాయ కుల, చేతి వృత్తిదారులను గుర్తించి, ఆన్‌లైన్లో నమోదు, పరిశీలన ప్రక్రియ చేపట్టాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ క్రెడిట్ సపోర్ట్, మార్కెట్ సపోర్టు, రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ఇంప్లిమెంటేషన్ ఫ్రేమ్‌వర్క్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం పి.ఏసుదాసు, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ రమణ, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ బాలరాజు తదితరులు హాజరయ్యారు.

## జ్ఞానం, మంచి నడవడిక నేర్పుతున్న ప్రేమాలయం



మేయర్ దంపతులను సన్మానిస్తున్న ప్రేమాలయం కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రేమాలయం ప్రతినిధులు సమాజంలో ఎంతోమందిని గుణవంతులుగా తీర్చిదిద్దుతున్నారని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. స్థానిక కైకలూరు రోడ్డు రతంగపాణి చెరువు వెనక ఉన్న ప్రేమాలయం ప్రాంగణంలో ప్రేమాలయం సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన జ్ఞాన – ధ్యాన – సత్సంగం భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రేమాలయం ద్వారా ఎంతో మందికి జ్ఞానం, సద్బుద్ధి, మంచి నడవడిక ప్రేమాలయం గురువులు నేర్పిస్తున్నారన్నారు. ఒంటరి, అనాథ వృద్ధులను చేరదీసి నివాసం, భోజనం, ఆరోగ్యంగా ఉండడానికి డాక్టర్ల పర్యవేక్షణతో ప్రేమాలయం నిర్వహిస్తుండడం అభినందనీయమని కొనియాడారు.

**ధ్యానంతో ఆత్మశుద్ధి**

ధ్యానంతో ఆత్మశుద్ధి సాధ్యమని మెడిటేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.రవికుమార్ రెడ్డి అన్నారు. ఉదయం జరిగిన జ్ఞాన ధ్యాన సత్సంగం సదస్సులో రవికుమార్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిత్యం నియమం తప్పకుండా కనీసం 15 నిమిషాల పాటు ధ్యానం చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులు ధ్యాన సాధన ద్వారా జ్ఞాపకశక్తి పెంచుకుని తమతమ చదువుల్లో సత్ఫలితాలు పొందవచ్చని సూచించారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రేమ, ఆప్యాయతలకు, ప్రశాంత వాతావరణానికి నిలయమైన ప్రేమాలయం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు, నిర్వాహక కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. ప్రేమాలయం కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ ప్రసంగిస్తూ బుద్ధుడు ఆచరించిన 'ఆనాపానసతి' ఎంతో ఉత్తమమైన ధ్యాన ప్రక్రియ అని చెప్పారు. శ్వాసను స్పష్టంగా తెలుసుకుంటూ, ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రతను స్థిరపరచకోవచ్చన్నారు. సేవాభావం గల వారికి సేవాసాధన విభాగంలో జ్ఞాన ధ్యాన శిక్షణ ఇవ్వడానికి ప్రేమాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సిద్ధం ఉందన్నారు. కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ నరేంద్ర, సుంకర చంద్రశేఖర్, సబ్బన శ్రీనివాసరావు, ప్రేమాలయం గౌరవ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, కార్యదర్శి ఎం మురళీకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**దేవదాయ ఆస్తుల అభివృద్ధి అభినందనీయం**

దేవదాయ శాఖ ఆస్తుల అభివృద్ధికి అధికారులు తీసుకుంటోన్న చర్యలు అభినందనీయమని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ప్రశంసించారు. దేవదాయ శాఖకు చెందిన దుకాణ భవనాన్ని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ దంపతులు ప్రారంభించారు. స్థానిక ఒన్ టౌన్‌లో శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి చెందిన శిథిల దుకాణ భవనం స్థానంలో రూ.16 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించిన ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ దుకాణం ద్వారా అన్నదాన సమాజానికి నెలకి రూ.41 వేల ఆదాయం వస్తుందని నూర్జహాన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, మున్సిపల్ కార్పొరేషన్ విప్ పైడి భీమేశ్వరరావు, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, నిడికొండ అన్నపూర్ణ నరేంద్ర, సబ్బన శ్రీనివాసరావు, కర్రి శ్రీను, జనపరెడ్డి కనక శ్రీ రాజేశ్వరి కృష్ణ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు గోపి మోటమర్రి సదానంద్, ఈఓ సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను సాధిద్దాం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న చేతివృత్తిదారుల నాయకులు

ఏలూరు (టూటౌన్): మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యుత్ పోరాట అమరవీరుడు సత్తెనపల్లి రామకృష్ణ, తెలంగాణపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ గరికపాటి రాజారావుల వర్ధంతి కార్యక్రమం ఆర్‌ఆర్‌పేటలోని చేతి వృత్తిదారుల జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. రజక వృత్తిదారుల జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేతివృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో విద్యుత్ పోరాటాన్ని నిర్ధాక్షిణ్యంగా అణచివేశారని గుర్తు చేశారు. ఉద్యమ కారులపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఇద్దరు కార్యకర్తలు చనిపోగా మరెందరో గాయపడ్డారని వివరించారు. పోలీసుల దాష్టీకంలో అమరుడైన రాష్ట్ర రజక వృత్తిదారుల కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ అమరుడైనట్టు చెప్పారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కళ కళకోసం కాదు ప్రజల కోసమేనని చాటి చెప్పిన ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని అన్నారు. వైద్య వృత్తిని చేస్తూనే ప్రజానాట్యమండలిని ఏర్పాటు చేసి ప్రజలలో వర్గ చైతన్యాన్ని తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు ఆగొల్ల వెంకట కృష్ణారావు, కొత్తల శివకుమార్, సుందరయ్య గ్రంథాలయ నిర్వాహకులు కంది విశ్వనాథం, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన



ర్యాలీ అనంతరం మాట్లాడుతున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): అంధత్వ నివారణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులతో స్థానిక జిల్లా ఆసుపత్రి నుంచి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నేత్ర దాతలు కండి మరో ఇద్దరికి కంటి వెలుగు ఇవ్వండి అంటూ నినదించారు. అనంతరం ప్రోగ్రాం మేనేజర్ మల్లికార్జున రాజు మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గత 15 రోజులుగా అన్ని ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నేత్రదాన అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. నేత్రదాన పక్షోత్సవాల గురించి వివరించారు. దేశంలో కార్నియా లోపంతో దృష్టి కోల్పోయిన వారు 12 లక్షలకుపైగా ఉండగా, ప్రతి ఏటా కార్నియా లోపంతో 25 వేల మంది వరకు దృష్టిని కోల్పోతున్నారని తెలిపారు. వీరిలో అధిక శాతం మంది యువతరం ఉన్నారన్నారు. వీరికి సరిపడా కార్నియా కనుక లభ్యమైతే వీరందరూ అంధులుగా మిగిలిపోవాల్సిన అవసరం ఉండదని చెప్పారు. నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదరిశ బి.బెన్ని, రెడ్ క్రాస్ నర్సింగ్ విద్యార్థినులు, అంధత్వ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.